# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-04-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఎన్నికల అధికారులు సమన్వయంతో... నిరంతర అప్రమత్తతో ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని రాష్ట్రానికి ప్రత్యేక ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన రామ్మోహన్ మిశ్రా సూచించారు.**
2. **మాజీ ప్రధాని మన్‌మోహన్ సింగ్‌తో సహా పలువురు రాజ్యసభ సభ్యులు ఈరోజు పదవీ విరమణ చేయనున్నారు.**
3. **దేశంలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రమోషన్ స్కీం 2024 అమల్లోకి వచ్చింది.**
4. **వేసవి కారణంగా ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా హౌరా-యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.**
5. **రాగల నాలుగు రోజులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది.**

==========================

నిరంతర అప్రమత్తతతో సమన్వయంతో ఉన్నతాధికారులు సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషిచేయాలని రాష్ట్ర ప్రత్యేక సాధారణ పరిశీలకులు రామ్ మోహన్ మిశ్రా అన్నారు. విజయవాడలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూంని ఆయన పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌లోని సీ-విజిల్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, సాంకేతిక విభాగం, బ్యాంకింగ్, సామాజిక మాధ్యమాల తదితర విభాగాల కార్యకలాపాలను ఆయన పర్యవేక్షించారు. ఎన్నికల నిర్వహణకు చేపట్టిన చర్యలను జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటాలు రామ్ మోహన్ మిశ్రాకు వివరించారు. ఎన్టీఆర్ జిల్లాలో 85 శాతం ఓటింగ్ లక్ష్యంగా విస్తృత ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఏప్రిల్ 13, 14 తేదీల్లో పీవో, ఏపీవోలకు వేరువేరుగా శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అదే విధంగా పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా.. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకున్న చర్యలను వివరించారు. రాజకీయ పార్టీలపై నమోదైన కేసులు, ఎన్నికల ప్రవర్తనా నియామావళి అమలు తీరు, ఉల్లంఘనలపై తీసుకుంటున్న చర్యలను, జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద నిఘా కార్యకలాపాలను వివరించారు.

--------------------------

---

ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఈరోజు చిత్తూరు జిల్లాలో కొనసాగుతోంది. అమ్మగారిపల్లె ప్రాంతం నుంచి ఈరోజు బయలుదేరి సదుం, కల్లూరు, దామలచెరువు, తలుపులపల్లి మీదుగా తేనెపల్లి చేరుకుని అనంతరం రంగంపేట క్రాస్ మీదుగా పూతలపట్టు చేరుకున్నారు. పూతలపట్టులో ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో నిరంతరాయంగా అభివృద్ధి జరిగిందని అన్నారు. పారదర్శకంగా పరిపాలనను, సంక్షేమ పథకాలను అమలు చేశామని పేర్కొన్నారు. ఇలా వుండగా సభ అనంతరం పి.కొత్తకోట, పాకాల క్రాస్, గదంకి, పనపాకం, ముంగిలిపట్టు, మామండూరు, ఐతేపల్లి క్రాస్, చంద్రగిరి క్రాస్, రేణిగుంట మీదుగా గురువరాజుపల్లె చేరుకొని రాత్రి అక్కడ బస చేయనున్నారు.

---

రాజ్యసభ నుంచి ఈ రోజు పలువురు సభ్యులు పదవీ విరమణ చేయన్నునారు. వారిలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ కూడా ఉన్నారు. రాజ్యసభ సభ్యుడిగా 33 ఏళ్ల పాటు డాక్టర్ మన్మోహన్‌సింగ్ సేవలనందించారు. 1991 అక్టోబరులో మొదటిసారిగా ఆయన రాజ్యసభకు ఎన్నికవ్వగా 1991 నుంచి 1996 వరకు పీవీ దేశ ఆర్థికమంత్రిగా పనిచేశారు. 2004 నుంచి 2014 వరకు పదేళ్లపాటు దేశ ప్రధానిగాను సేవలందించారు. మన్మోహన్ సింగ్ ఖాళీ చేయనున్న స్థానంలో ఇటీవల రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ తొలిసారిగా ఎగువ సభకి రానున్నారు.

---

దేశంలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 4 నెలలకు ప్రకటించిన ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రమోషన్ స్కీం -ఈ. ఎం. పీ. ఎస్. 2024 అమలు ప్రారంభమైంది. ఈ నెల 1 నుంచి జులై 31 వరకు ఈ కొత్త పథకం అమల్లో ఉంటుంది. రాయితీల కోసం 5 వందల కోట్లరూపాయలు కేటాయించారు. తద్వారా దాదాపు 3.72 లక్షల ఈవీల కొనుగోలును ప్రోత్సహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. విద్యుత్తు వాహనాల తయారీ, వినియోగాన్ని పెంచేందుకు తీసుకొచ్చిన ఫేమ్ రెండో దశ పథకం గడువు మార్చి 31తో ముగిసిన నేపథ్యంలో దీనికి కొనసాగింపుగా ఈ కొత్త పథకాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. విద్యుత్ ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇ-రిక్షాలు, ఇ-కార్ట్‌లకు ఈ పథకం వర్తిస్తుందని కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పర్యావరణ అనుకూల వాహనాలను ప్రజలకు సరసమైన ధరలకు అందించేందుకు ఈ పథకాన్ని ఉద్దేశించినట్లు పేర్కొంది.

---

సార్వత్రిక ఎన్నికల్లో పోలీసు శాఖ సమర్థంగా పనిచేసే దిశగా సరిహద్దు చెక్ పోస్టుల్లో నిరంతర నిఘాను మరింత బలోపేతం చేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. అమలపురంలో ఎస్పీ కార్యాలయంలో ఎన్నికల బందోబస్తు, జిల్లాకు వచ్చిన కేంద్ర బలగాలపై జిల్లా పోలీసు అధికారులతో నిన్న నిర్వహించిన సమావేశంలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా, సమర్థంగా నిర్వహించే అంశాలపై ఐజీ అశోక్‌కుమార్ అంశాల వారీగా సమీక్షించారు.

---

వేసవి కారణంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హౌరా-యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. హౌరా-యశ్వంత్‌పూర్ వీక్లీ ఏసీ స్పెషల్ రైలు ఈ నెల 4, 11వ తేదీల్లో హౌరాలో బయల్దేరి మరుసటిరోజు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి బయల్దేరి అదేరోజు మధ్యరాత్రి 12.15గంటలకు యశ్వంత్‌పూర్ చేరుకుంటుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్-హౌరా ప్రత్యేక రైలు శనివారాల్లో ఈ నెల 6,13 తేదీల్లో యశ్వంత్‌పూర్‌లో బయల్దేరి అదేరోజు రాత్రి 11.05గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి బయల్దేరి మరసటిరోజు హౌరా చేరుకుంటుందని ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

---------------------------

రాగల నాలుగు రోజులు రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు పలుచోట్ల 2 నుంచి 3 డిగ్రీలు, అక్కడక్కడ 4 నుంచి 5 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాయలసీమతోపాటు కోస్తాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని వెల్లడించింది. అదే సమయంలో వేడి, తేమ, అసౌకర్య వాతావరణం కొనసాగుతుందని పేర్కొంది. ఈ నెల 7వ తేదీ నుంచి గాలిలో మార్పు వల్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు ఆస్కారం ఉందని అమరావతి వాతావరణం కేంద్రం డైరెక్టర్ ఎస్.స్టెల్లా తెలిపారు.

---------------------------

రెండు రోజుల క్రితం విశాఖ తీరం నుంచి చేపల వేటకు వెళ్లి గల్లంతైన ఆరుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు. చేపల వేట ముగించుకుని తిరిగివస్తోన్న సమయంలో గాలితీవ్రతకు పడవ బోల్తాపడిందని అదే పడవతో తమ వద్ద వున్న ఫ్లెక్సీని తెరచాపలా ఉపయోగించి అప్పికొండ సముద్ర తీరానికి చేరుకున్నారని తెలిపారు. మత్స్యకారులను మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయానికి తీసుకువచ్చి వారి కుటుంబాలకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

---------------------------

ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పేర్కొన్నారు. పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా విపత్తులు నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి ఎండ తీవ్రత, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా శాఖల ద్వారా చేపట్టవలసిన చర్యలు జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, పట్టణ కార్యాలయాల్లో ప్రథమచికిత్స కిట్‌లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో చలివేంద్రాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఉదయం, సాయంత్రం మాత్రమే అత్యవసరమైన పనులు చేసుకోవాలని, అత్యవసరమై ఒకవేళ ఎండలో బయటకు వెళ్ళవలసి వస్తే ప్రతి 20 నిమిషాలకు ఒకసారి నీటిని త్రాగాలని సూచించారు.

---------------------------

ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో తిరుపతిలోని అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర సాయుధ బలగాలతో ఈరోజు కవాతు నిర్వహించారు. జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ ఆధ్వర్యంలో ఉప్పరపాలెం, శెట్టిపల్లి గ్రామాల పరిధిలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా తిరుపతి ఎస్పీ పాత్రికేయులతో మాట్లాడుతూ

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా.. ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

-----------------------------

2024 జాతీయ ప్రసార విధానాన్ని రూపొందించేందుకు సలహాలు సూచనలు కోరుతూ భారత టెలికాం నియంత్రణ ప్రాధికార సంస్థ –ట్రాయ్ ఒక సంప్రదింపుల పత్రాన్ని విడుదల చేసింది.ప్రసార రంగంలో వివిధ అంశాలకు సంబంధించిన సమస్యలు పైరసీని ఎదుర్కొనడం కంటెంట్ భద్రత ఉండేలా చూడడం మొదలైన అంశాల గురించి ఈ పత్రంలో పేర్కొన్నారు. 2024 జాతీయ ప్రసార విధాన రూపకల్పనకు సలహాలు, సూచనలు అనే ఈ పత్రాన్ని ఏప్రిల్ 30వ తేదీ నాటికల్లా భాగస్వాముల నుంచి స్పందన కోరే లక్ష్యంతో రూపొందించామని ఈ పత్రాన్ని ట్రాయ్ వెబ్సైట్లో అందుబాటులోకి తెచ్చామని తెలిపింది.

========================